హరీశ్ సవాల్.. రేవంత్ ధమాల్

మూడోపేజీ తరువాయి...

తీర్మానం చేయాలని, పీవీ గౌరవాన్ని పెంచాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పీవీని పట్టించుకోకపోయినా కేసీఆర్ ప్రభుత్వం పీవీ ఘాట్ నిర్మించిందని, అసెంబ్లీలో పీవీ చిత్రపటం ఏర్పాటు చేసిందని, శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిందని, పీవీ కుమార్తె వాణీదేవికి ఎమ్మెల్సీ ఇచ్చామని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడటానికి అవసరమైనంతసేపు మైక్ ఇస్తామని బయట చెప్తున్నారని, సభలో మాత్రం అడిగీ.. అడిగీ గొంతు నొప్పి పెట్టినా ఇవ్వడంలేదని విమర్శించారు. హరీశ్‌రావు తన ప్రసంగం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి అనేక ప్రశ్నలు సంధించగా ఆయన నుంచి సమాధానం రాలేదు.

శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

1) **సీఎం వ్యాఖ్య:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నన్ను కలవడానికి వస్తే ఆ పార్టీ నాయకత్వం వారిని అనుమానిస్తున్నది. చివరికి ప్రెస్‌మీట్లు పెట్టించి, వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.
హరీశ్ కౌంటర్: నమ్మకం లేనిది మా రాష్ట్ర నాయకత్వానికి కాదు. మీ ఢిల్లీ అధిష్ఠానానికి. అందుకే మీరు ఇటీవల ఢిల్లీకి ప్రధానిని కలిసేందుకు వెళ్లిన ప్రతిసారీ వెంట డిప్యూటీ సీఎం కూడా ఉన్నారు.
సీఎం నుంచి సమాధానం రాలేదు

2) **సీఎం వ్యాఖ్య:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గత నెలలో 4వ తేదీలోగా జీతాలు ఇస్తే.. ఈసారి మొదటి తేదీనే జీతాలు ఇచ్చినం.
హరీశ్ కౌంటర్: ఒకటో తేదీన జీతాలు ఇచ్చారనడం సత్యదూరం. ఏడో తేదీన కూడా జీతాలు పడ్డాయి. ఈరోజు (శుక్రవారం) ఉదయం కాంట్రాక్ట్ లెక్చరర్లు వచ్చారు. రెండు నెలలుగా జీతాలు రాలేదని, అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. 12,660 ఈజీఎస్ ఉద్యోగులకు, వేలమంది ఐకేపీ, వీవోఏలకు, దవాఖానల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, సర్వశిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి ఇప్పటివరకు జీతాలు పడలేదు.
సీఎం నుంచి సమాధానం రాలేదు

3) **సీఎం వ్యాఖ్య:** రాష్ట్రంలోని దాదాపు 80 శాతం మంది పెన్షనర్లకు ఇప్పటికే పెన్షన్ అందించాం.
హరీశ్ కౌంటర్: రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో ఆసరా పెన్షన్లు ఇవ్వలేదు. ఆ పెన్షన్ ఫిబ్రవరిలో ఇస్తున్నారు. అంటే జనవరిలో పడాల్సిన పెన్షన్‌ను ఎగ్గొట్టారు.
సీఎం నుంచి సమాధానం రాలేదు

4) **సీఎం వ్యాఖ్య:** రైతుబంధు డబ్బులను గతంలో ఐదారు నెలలపాటు రైతులకు వేసేవారు.
హరీశ్ కౌంటర్: ఈ ప్రకటనలో కొంత సత్యం, కొంత అసత్య ఉన్నది. మా హయాంలో రూ.7,500 కోట్లు రైతుబంధు వేయాల్సి ఉంటే చిన్న రైతులందరికీ దాదాపు రూ.6 వేల కోట్లు మొదటి నెలలోనే వేశాం. కానీ కాంగ్రెస్ హయాంలో రెండుమూడు వందల కోట్ల నుంచి మొదలుపెట్టారు. చాలా ఎక్కువగా పెండింగ్ ఉన్నాయి.
సీఎం నుంచి సమాధానం రాలేదు

5) **సీఎం వ్యాఖ్య:** కొందరికి రూ.100 పెట్టి పెట్రోల్ కొనడానికి డబ్బులు ఉంటాయి కానీ అగ్గిపెట్టె కొనుక్కోవడానికి రూపాయి కూడా ఉండదు.
హరీశ్ కౌంటర్: ఆనాటి భావోద్వేగాలు ఉద్యమకారులకు అర్థం అవుతాయి. రేవంత్ ఏనాడూ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించలేదు. అమరవీరుల కుటుంబాలను పరామర్శించలేదు.. ఒక్కరి పాడె మోయలేదు. ఉద్యమకారుల మీదికి తుపాకులు పట్టుకొని పోయినవారికి అమరవీరుల గురించో, తెలంగాణ ఉద్యమం గురించో తెలుస్తుందని అనుకోను. అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులాగా అగ్గిపెట్టె ముచ్చట ఇక బంద్ చేయండి. తెలంగాణ పోరాటంలో నా ప్రయత్నాన్ని కించపరిచి తగ్గిస్తామంటే మీ విజ్ఞతకు వదిలేస్తున్నా.
సీఎం నుంచి సమాధానం రాలేదు

6) **సీఎం వ్యాఖ్య:** బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో ఎస్ఎల్బీసీ టన్నెల్‌ను కిలోమీటర్‌న్నర మాత్రమే తవ్వింది.
హరీశ్ కౌంటర్: సీఎం మొన్న ప్రెస్‌మీట్‌లో కిలోమీటర్ అన్నారు. ఇప్పుడు కిలోమీటరున్నర అంటున్నారు. ముందుగా మీరు ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకోండి. మా హయాంలో 11 కిలోమీటర్లు తవ్వాం.
సీఎం నుంచి సమాధానం రాలేదు

7) **సీఎం వ్యాఖ్య:** శ్రీశైలం, నాగార్జునసాగర్, పెద్దవాగు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే డిపాజిట్ కింద జమ చేసేందుకు రూ.200 కోట్ల చొప్పున 2023-24లో బడ్జెట్‌లో కేటాయించారు.
హరీశ్ కౌంటర్: రూ.200 కోట్లు కేవలం ప్రతిపాదనలే. ఒక్క రూపాయి కూడా రిలీజ్ చేయలేదు. మేము కేఆర్ఎంబీకి కొన్ని షరతులు పెట్టాం. అవి ఒప్పుకుంటేనే ప్రాజెక్టులు అప్పగిస్తామని స్పష్టంచేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణ, ఏపీకి సగంసగం ఇవ్వాలని, పోతిరెడ్డిపాడుకు 34 టీఎంసీలకు మించి ఒక్క చుక్క ఎక్కువ ఇవ్వొద్దని, శ్రీశైలం ఎండీడీఎల్ 830 అడుగులు మెయింటెయిన్ చేయాలని, తాగునీటిలో 20 శాతమే అకౌంటబిలిటీ చేయాలని షరతులు పెట్టాం. వాళ్లు ఒప్పుకోలేదు.. మేం నయాపైసా విడుదల చేయలేదు.
సీఎం నుంచి సమాధానం రాలేదు

8) **సీఎం, నీటిపారుదల శాఖ మంత్రుల వ్యాఖ్య:** మా ప్రభుత్వం ఏర్పడి కేవలం 60 రోజులు అయ్యింది. ఈ సమయంలో ప్రాజెక్టుల గురించి మమ్మల్ని ఎవరూ మీటింగ్‌లకు పిలువలేదు. మేం ఎక్కడికీ వెళ్లలేదు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించేందుకు గత ప్రభుత్వమే నిర్ణయం తీసుకున్నది. మేం ప్రాజెక్టులను ఎవరికీ అప్పజెప్పలేదు, అప్పజెప్పబోము. ఎక్కడి నుంచో మినిట్స్ తీసుకొచ్చి చదువుతున్నారు.
హరీశ్ కౌంటర్: ఈ మినిట్స్ కేంద్రం స్వయంగా విడుదల చేసినవి. ప్రాజెక్టుల అప్పగింతపై జనవరి 17వ తేదీ, ఫిబ్రవరి 1వ తేదీన సమావేశాలు జరిగాయి. 17న జరిగిన సమావేశంలో నాగార్జునసాగర్, శ్రీశైలంను నెల రోజుల్లో అప్పగిస్తామని ఒప్పుకొని సంతకాలు చేసివచ్చారు. బోర్డు నిర్వహణకు రెండు రాష్ట్రాలు సిబ్బందిని కేటాయించాలని, వారి జీతభత్యాలను ఆయా రాష్ట్రాలే భరించాలని మినిట్స్‌లో స్పష్టంగా ఉన్నది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోకుంటే సిబ్బంది డిప్యూటేషన్లు, జీతాల ప్రస్తావన ఎందుకు వస్తుంది? అప్పుడు ఒప్పుకొని.. ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలెక్క గిలగిల కొట్టుకుంటున్నరు. తప్పయిపోయింది.. తెలిసో తెలియకో ఒప్పుకున్నాం, మేం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాం అని చెప్తే సహకరించడానికి మేం సిద్ధంగా ఉన్నాం.
సీఎం నుంచి స్పందన లేదు.

9) **సీఎం, నీటిపారుదల శాఖ మంత్రుల వ్యాఖ్య:** తెలంగాణ పరిధిలో ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఏపీ పోలీసులు వచ్చి ఆక్రమిస్తే మీ ప్రభుత్వం చేష్టలుడిగి చూసింది.
హరీశ్ కౌంటర్: నాగార్జునసాగర్‌ను ఏపీ పోలీసులు పోలింగ్ జరిగే రోజు అదుపులోకి తీసుకున్నారు. అప్పుడు శాంతిభద్రతల అంశం ఎన్నికల సంఘం పరిధిలో ఉన్నది. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి మాత్రమే ఉన్నారు. మరి ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ఇంకా నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఆర్పీఎఫ్ పోలీసుల భద్రతలోనే ఎందుకు ఉన్నది? వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవాలి. రమ్మంటే మేం వెంట వస్తాం. సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం.
ఇద్దరి నుంచి సమాధానం లేదు.

తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసే కుట్ర

- తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తామనడం సరికాదు
- రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాక రోజుకో రాగం
- మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 9 : తెలంగాణ చిహ్నంలో మార్పులు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ చిహ్నంలో 800 ఏండ్ల చరిత్ర కలిగిన కాకతీయ తోరణం, చార్మినార్ చిహ్నాలు ఉన్నాయని తెలిపారు. అయితే, క్యాబినెట్‌లో తీర్మానం చేసి ఈ చిహ్నం తొలగిస్తామని, రాచరిక పోకడలకు సూచిక లెక్క ఉన్నదని మాట్లాడటం పద్ధతి కాదని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అశోక చక్రం ఉన్న మూడు సింహాలతో భారత ప్రభుత్వ చిహ్నం రూపొందించారని, మరి ఇది రాచరిక పాలనకు సంకేతమా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సీమాంధ్ర పాలకుల మైకంలోనే ఉన్నారనే అర్థం అవుతుందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేస్తామని కూడా మాట్లాడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పేర్లు మార్చడం కాదు.. ప్రజలకు ఏం చేయబోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆటోల్లో అసెంబ్లీకి బీఆర్ఎస్ సభ్యులు

లోపలికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆటోల్లో అసెంబ్లీ సమావేశాలకు వచ్చి కార్మికులకు మద్దతు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారి కుటుంబాలు గడవడం కష్టంగా ఉన్నదని చెప్పారు. ఇప్పటికే అనేక మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు చేరుకున్న ఎమ్మెల్యేలు.. ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు ప్లకార్డులు పట్టుకొని ఆటోల్లో వచ్చారు. వారి ఆటోలను అసెంబ్లీ లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో పోలీసులు, ఎమ్మెల్యేల మధ్య కొద్ది సేపు తోపులాట జరిగింది. చివరికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటోలు దిగి నడుచుకుంటూ అసెంబ్లీ లోపలికి వెళ్లారు.

ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా శుక్రవారం అసెంబ్లీ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కేసీఆర్ గుర్తులన్నీ.. చెరిపేస్తా!

మూడోపేజీ తరువాయి...

ఎమ్మెల్యేలను కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వృద్ధులకు, ఇతర పెన్షన్లను కూడా ఒకటో తేదీనే ఇస్తున్నట్టు చెప్పారు. ఈ నెలలో ఇప్పటివరకు 80 శాతం పెన్షన్లు అందించామని, మరో 20 శాతం పెండింగ్‌లో ఉన్నాయని, 15వ తేదీలోపు మొత్తం పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుబంధును ఆలస్యంగా వేసేదని ఆరోపించారు. 2018-19 నుంచి ఈ ఏడాది యాసంగి సీజన్ వరకు ప్రతిసారి ఆలస్యంగానే వేసిందని విమర్శించారు. శాసనసభ్యులు ఏ పార్టీకి చెందినవారైనా వారి వినతులను ప్రభుత్వం వింటుందని హామీ ఇచ్చారు.

ఉచిత బస్‌తో పెరిగిన ఆదాయం

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడంపై కొందరు రాద్ధాంతం చేస్తున్నారని సీఎం విమర్శించారు. ఆటోవాళ్లకు ఆదాయం పోయిందంటూ అనవసరం రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల దేవాలయాలకు భారీగా ఆదాయం పెరిగిందని, ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. ఉచిత బస్సు పథకానికి ముందు నవంబర్‌లో దేవాలయాల ఆదాయం రూ.49.28 కోట్లు ఉండగా, పథకం అమలు తర్వాత డిసెంబర్‌లో రూ. 93.24 కోట్లకు పెరిగిందని తెలిపారు. జనవరిలో రూ.68.69 కోట్లు వచ్చిందని వెల్లడించారు. ఇప్పటికే ఈ పథకం కోసం రూ. 530.52 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు.

జస్ట్ లైక్ దట్.. అలా ఉద్యోగాలు భర్తీ చేయలేం

ప్రతిపక్షాలు 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడంటూ ప్రశ్నిస్తున్నాయని, కానీ ఉద్యోగాల భర్తీ కోసం ఓ పద్ధతి ఉంటుందని సీఎం తెలిపారు. జస్ట్ లైక్ దట్.. అలా చేయలేమని తేల్చేశారు. సరైన విధానం కోసం ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. 15 రోజుల్లో 15 వేల పోలీస్ ఉద్యోగాల నియామకం చేపడతామని వెల్లడించారు. ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 46 ఏండ్లకు పెంచుతామని ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేయకపోతే తామే నర్సు పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు.

మేడారం జాతరలో ప్లాస్టిక్‌ను వాడొద్దనే ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్

ఆన్‌లైన్‌లో మేడారానికి నిలువెత్తు బంగారం

- ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): మేడారం సమ్మక్క-సారలమ్మకు ఆన్‌లైన్‌లో నిలువెత్తు బంగారం సమర్పించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తన మనమడు రియాన్స్ నిలువెత్తు బంగారం ఆన్‌లైన్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి సమర్పించారు. తన మనవరాలి నిలువెత్తు బంగారాన్ని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల కోసం అమ్మవార్లకు బంగారాన్ని సమర్పించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

విభజన చట్టంలోనే ప్రాజెక్టుల అప్పగింత నిర్ణయం

2014లో ఆమోదించిన రాష్ట్ర విభజన చట్టంలోనే కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతకు నిర్ణయం జరిగిందని సీఎం తెలిపారు. చట్టంలో లోపం ఆనాటి ప్రభుత్వాలది కాదా? అని ప్రశ్నించారు. కృష్ణా జలాలపై నల్లగొండలో బీఆర్ఎస్ ధర్నా చేస్తామనడంపై స్పందిస్తూ.. ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని ఆరోపించారు. తాము ఇప్పటికీ దీన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ తమతో కలిసి రావాలని, కలిసి కొట్లాడుదామని విజ్ఞప్తి చేశారు. 12వ తేదీన ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చ పెట్టనున్నట్టు తెలిపారు. 3వ తేదీన ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను అసెంబ్లీ నుంచి ప్రత్యేకంగా కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు తీసుకెళ్తామని చెప్పారు.

మెట్రోపై కేంద్రానికి ప్రతిపాదన

రంజాన్ పండుగ ఏర్పాట్ల కోసం ఇప్పటికే రూ.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్టు సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని, ఇందుకోసం ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. ఇటీవల వెల్లడించిన ప్రకారం మెట్రో రూట్లలో మార్పులు చేసినట్టు వివరించారు. 56 కిలోమీటర్ల పొడవున మూసీని నదిని సుందరీకరించనున్నట్టు తెలిపారు. హైదరాబాద్ జిల్లా కోసం కొత్త కలెక్టరేట్‌ను నిర్మిస్తామని ప్రకటించారు.

సీఎం సారీ చెప్పాలి!

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై శాసనమండలిలో దుమారం
- బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనతో అట్టుడికిన సభ
- చర్చ లేకుండానే గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు

హైదరాబాద్, ఫిబ్రరి 9(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనమండలి సభ్యులను ఉద్దేశించి ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'కౌన్సిల్‌లో కూర్చుంటే ఇరానీ కేఫ్‌లో కూర్చొని రియల్‌ఎస్టేట్ కొనుగోలు, అమ్మకాలు చేసినట్టు అనిపిస్తుంది' అని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం శాసనమండలి అట్టుడికింది. 'సీఎం సారీ చెప్పాల్సిందే'నంటూ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగలేదు. పలువురు మంత్రులు వచ్చి సీఎం తరపున తాము సమాధానం ఇస్తామన్నా సభ్యులెవరూ ఒప్పుకోలేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుసార్లు మండలి వాయిదాపడింది. ముఖ్యమంత్రి వచ్చేవరకు సభను నడిపించబోమంటూ ఎమ్మెల్సీలు భీష్మించారు. దీంతో చివరకు సాయంత్రం 6.50 గంటలకు ఎలాంటి చర్చలేకుండానే గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్టు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటిస్తూ సభను శనివారానికి వాయిదా వేశారు.

మండలిని అగౌరపరచడమే

శాసనమండలి, ఎమ్మెల్సీలనుద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని, చట్టసభలను, సభ్యులను కించపర్చడమే అవుతుందని బీఆర్ఎస్ సభ్యులందరూ మూకుమ్మడిగా నిరసన తెలిపారు. సీఎం స్వయంగా మండలికి వచ్చి క్షమాపణ చెప్పేవరకు సభను నిర్వహించవదని చైర్మన్‌ను కోరుతూ పోడియం వద్ద బైఠాయించారు. శాసనమండలి శుక్రవారం ఉదయం ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు లేచి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనే వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. సీఎం శాసనసభలో ఉన్నారని, ఆయన తరపున తాము సమాధానం చెప్తామని మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పగా.. తాము ఒప్పుకొనేదిలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తేల్చిచెప్పారు. దీనిపై చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా వారితో మాట్లాడే ప్రయత్నం చేయగా ఎమ్మెల్సీలు పట్టు వీడలేదు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా మండలికి వచ్చి పలువురు ఎమ్మెల్సీలు, చైర్మన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఫలితం లభించలేదు.

మాటజారిన జూపల్లి

ఓవైపు ఎమ్మెల్సీలు ఆందోళన చేస్తుండగా.. మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీలో రాజ్యసభ సీట్లు ఇచ్చిన తీరుపై చేసిన వ్యాఖ్యలు గందరగోళానికి దారితీశాయి. ఆయన మాటలపై పలువురు ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పీవీకి భారతరత్నపై తీర్మానం

వాయిదా అనంతరం సభ సమావేశం కాగానే.. మాజీ ప్రధాని పీవీకి కేంద్రం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో అభినందన తీర్మానాన్ని ఆమోదించారు. పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులంతా ముక్తకంఠంతో ఆమోదించారు.

కొత్త ఎమ్మెల్సీల పరిచయ కార్యక్రమం..

ఈ గందరగోళంలోనే.. ఇటీవల కొత్తగా ఎంపికైన ఇద్దరు ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మహేశ్ కుమార్‌గౌడ్‌లను చైర్మన్ సభకు పరిచయం చేశారు. సభ వాయిదా పడిన అనంతరం మంత్రులు జూపల్లి, శ్రీధర్‌బాబు, తుమ్మలతో బీఆర్ఎస్ సభ్యులు పిచ్చాపాటి మాట్లాడుతుండగా బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్‌గౌడ్ అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కవిత వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. 'సభలో ఎలా ఉండాలో చూసి నేర్చుకో..ఎక్స్‌పీరియన్స్ అవుతుంది' అని బల్మూరి వెంకట్ భుజంపై చేయివేసి చెప్పారు.

ఓటుకు నోటు కేస్.. రేవంత్‌కు సుప్రీం నోటీస్

మూడోపేజీ తరువాయి...

ఉన్నాయి. అందువల్ల ఈ కేసు విచారణను భోపాల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేయండి' అని కోరారు. దీంతో నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని వ్యక్తిగత ప్రతివాదిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉదయ్‌సింహ, సంద్రవెంకట వీరయ్య ఇతర ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కేసును ప్రభావితం చేసే స్థితిలో నిందితుడు

2015లో టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి.. అప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు లంచం ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. ఈ అంశంపై ఏసీబీ కేసు నమోదుచేసింది. కేసు హైదరాబాద్‌లో ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట పెండింగ్‌లో ఉన్నది. ప్రస్తుతం ప్రధాన నిందితుడు సీఎం అయినందున విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉన్నదని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించేందుకు ఆస్కారం లేదని పిటిషనర్ల తరపున న్యాయవాదులు సిద్ధార్థ దవే, శేషాద్రి నాయుడు వాదించారు. గతంలో ఇదే తరహా కేసుల్లో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాన నిందితుడే ఇప్పుడు రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఉన్నందున కేసు దర్యాప్తు జరిపే పోలీసులు ఆయన కిందే పనిచేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కేసు విచారణ ప్రారంభమైతే పాలకుల పక్షపాత ధోరణి ప్రభావం కేసు విచారణపై ప్రతికూలంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు స్పందించిన ధర్మాసనం, ట్రయల్‌పై అలాంటి ప్రభావం ఉంటే తాము చూస్తూ కూర్చోబోమని వ్యాఖ్యానించింది. తిరిగి పిటిషనర్ల న్యాయవాదులు వాదనలు కొనసాగిస్తూ, నిందితుడు హైకోర్టును ఆశ్రయించి కేసు విచారణను నిలుపుదల చేయటంలో విజయం సాధించారని, కేసు విచారణను నిలుపుదల చేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. తనపై 88 క్రిమినల్ కేసులు నమోదైనట్టు నిందితుడే స్వయంగా ప్రకటించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. రేవంత్‌రెడ్డి సీఎం పగ్గాలు చేపట్టక ముందు అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని వివరించారు. 'మేం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గత ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించిన పోలీసు అధికారులందరినీ నగ్నంగా పరేడ్ చేయిస్తాం అని నిందితుడు బెదిరించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు సాక్షులు కేసు విచారణకు సహకరించేందుకు భయపడే అవకాశాలుంటాయి. ఎంపీగా, ఎమ్మెల్యేగా ఉండగానే పోలీసులను బెదిరించిన నిందితుడు ఇప్పుడు సీఎం అయ్యారు. ఐపీఎస్ అధికారులనే దుర్భాషలాడిన వ్యక్తి ఇప్పుడు రాష్ట్ర పాలక పగ్గాలు అందుకుంటే సాక్షులు రాగద్వేషాలకు అతీతంగా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పే అవకాశాలుండవు. ఇప్పటికే ఓటుకు నోటు కేసులో అనేక కీలక సాక్ష్యాధారాలను పోలీసులు సేకరించారు. ఇవన్నీ కోర్టులో నిరూపణ అవ్వాలంటే కేసు విచారణ తెలంగాణ కోర్టును నుంచి భోపాల్ కోర్టుకు కేసును బదిలీ చేయాలి' అని కోరారు.

ఆడియో, వీడియో ఆధారాలు

నిందితుడు ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు ఇస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని, ఈ కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు కూడా వెళ్లారని చెప్పారు. ఇప్పుడు ఆయన సీఎం పదవిలో ఉన్నందున కేసు విచారణ పూర్తిగా దెబ్బతీసేలా తన ఆధీనంలోని పోలీసు అధికారులతో పనిచ